## క్లుప్తంగా

### తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గడప శ్రీహరి



**అంబర్‌పేట:** తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గడప శ్రీహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులుగా వ్యవహరించిన ఏఎల్.మల్లయ్య మృతి చెందడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శులుగా ఏఎం.సుధాకర్, ఓంప్రకాష్, ఉపాధ్యక్షులుగా చాట్ల సదానంద్, సంఘం యూత్ ప్రెసిడెంట్‌గా అంబటి సుధాకర్‌ను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని గడప శ్రీహరి తెలిపారు.

### శంకరమఠంలో చండీహోమం



చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

**నల్లకుంట:** పౌర్ణమి సందర్భంగా నల్లకుంట శంకరమఠంలో శక్తి గణపతి, చంద్రమౌళీశ్వర స్వామి, శారదామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం ప్రాంగణంలో మంగళవారం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలు హోమంలో వేసి ఆవునెయ్యితో పూర్ణాహుతి చేసి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. టీఆర్టీకాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఘనంగా శ్రీ గౌర పూర్ణిమ



**బంజారాహిల్స్:** బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీ గౌర పూర్ణిమ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి అవతారంగా కొలిచే శ్రీ చైతన్య మహాప్రభు జయంతి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా 56 రకాలైన వంటకాలతో ఛప్పన్ భోగ్ పేరుతో నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీ నితాయ్ గౌరంగ్ అష్టోత్తరశత కలశ మహాభిషేకం, మహాపల్లకీ ఉత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కీర్తనలు, భజనలు, నృత్యాలతో సందడి చేశారు.

### ఘనంగా ఐఎస్‌ఓ కళాశాల వార్షికోత్సవం

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పరిధిలోని తార్నాక ఐఎస్‌ఓ ఇంటర్, డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం వర్సిటీ క్యాంపస్‌లోని మోకాస్టార్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి విద్యాసంస్థల డీన్ మనోహర్ అధ్యక్షత వహించగా డైరెక్టర్ వినోద వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ డే క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందశారు. ప్రిన్సిపాళ్లు చక్రపాణి, ప్రదీప్, పద్మ పాల్గొన్నారు.

### వాల్మీకుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

**లిబర్టీ:** అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న వాల్మీకుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం తన 8 ఏళ్ల పాలనలో ఇప్పటి వరకు దేశంలో ఉన్న లక్షలాది మంది వాల్మీకుల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. 2023–24 వార్షిక బడ్జెట్‌ను 45 లక్షల కోట్లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు తప్ప వాల్మీకుల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం వాల్మీకుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

### బీఆర్‌జేసీ విద్యార్థికి రన్నింగ్‌లో మొదటి బహుమతి

**రాంగోపాల్‌పేట్:** ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో 'ఖేలో సికింద్రాబాద్ జీతో సికింద్రాబాద్' పేరుతో నిర్వహించిన పరుగు పందెలో సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లోని బీఆర్‌జేసీ పాఠశాలకు చెందిన విద్యార్థి మొదటి బహుమతి దక్కించుకున్నాడు. దోమల్‌గూడలోని ఏవీ కళాశాలలో జరిగిన 800 మీటర్ల పరుగు పందెలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎం వెంకటేష్ మొదటి స్థానంలో నిలిచాడు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా విజేతకు పతకంతో పాటు రూ.5వేల చెక్కు అందజేశారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి ప్రపంచంలో దేశ ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు.

## హోలీ
# రంగుల కేళీ..!



ముషీరాబాద్/ అంబర్‌పేట్ జోన్ పరిధిలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు పూసుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యువతీ, యువకులు ఒకరిపై ఒకరు రంగులు పూసుకుంటూ సంగీతానికి లయబద్ధంగా ఆడిపాడుతూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. రాంనగర్, బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి, గాంధీనగర్, అడిక్‌మెట్, కవాడిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల్లో ఈ హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి.

– అంబర్‌పేట్, ముషీరాబాద్ జోన్ బృందం




ఇందిరాపార్కులో మాట్లాడుతున్న మంత్రి తలసాని, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్పొరేటర్ రచనశ్రీ



రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి



హోలీ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్



గోల్నాక హోలీ సంబరాల్లో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్



పారిశుద్ధ్య కార్మికులతో గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ దంపతులు



చిక్కడపల్లి సూర్యనగర్‌లో హోలీ సంబరాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.
- రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.
- ఇందిరాపార్కు వెల్ఫేర్ వాకర్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు డా.సుధాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.
- గాంధీనగర్‌లో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పావనికుమార్ దంపతులు ఘనంగా నిర్వహించుకున్నారు. శుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది, జవాన్లకు ఎస్‌ఎఫ్‌ఏలు, అధికారులు, డివిజన్ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



అంబర్‌పేట్‌లో హోలీ సంబరాల్లో చిన్నారులు

### 'ఉగాదికి కమ్యూనిటీహాల్ పనులు పూర్తి'



శ్రీనివాసనగర్‌లో కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

**అంబర్‌పేట:** బాగ్ అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీ కమ్యూనిటీహాల్ నిర్మాణం ఉగాది నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కాలనీ ప్రజల కోసం సీడీపీ నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

### శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ దిడ్డి సుధాకర్



**లిబర్టీ:** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ దిడ్డి సుధాకర్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం సంఘం జాతీయ సమన్వయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఈయనను ఛండీగఢ్‌లో జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు, యుద్ధానికి వ్యతిరేకంగా తమ సంఘం కృషి చేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అంతర్జాతీయ సమాజాన్ని ఏకం చేస్తుందన్నారు.

## స్త్రీ పురుష సమానత్వంపై లఘు చిత్ర ప్రదర్శన



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీఎస్‌కే ఆధ్వర్యంలో స్త్రీ, పురుష సమానత్వంపై లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం వివిధ రంగాల్లో పలువురు ప్రముఖ మహిళలను ఘనంగా సత్కరించారు. ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్త్రీ, పురుష సమానత్వం అన్ని రంగాల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లఘు చిత్రంలో మహిళా లోకానికి అద్భుతమైన సందేశం ఇచ్చిందన్నారు. సమాజంలో పాతుకుపోయిన అంతరాలను పాలకులు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన తీరు ప్రశంసనీయమన్నారు. భూపతివెంకటేశ్వర్లు, నాయకులు బీడీఎల్ సత్యనారాయణ, పి.మోహన్‌రామ్, దుర్గాప్రసాద్, విజయకుమార్, శరణ్య, స్రవంతి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ దిబ్బలుగా ఖాళీ స్థలాలు



నల్లకుంటలో పేరుకుపోయిన చెత్త, చెదారాలు



- పర్యావరణానికి విఘాతంగా మారుతున్నాయని ఆవేదన
- జీహెచ్‌ఎంసీకి ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వినతి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** నగరంలో వేల సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలు ప్లాస్టిక్ దిబ్బలుగా మారి పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, ప్లాస్టిక్‌తో పాటు చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతూ.. గాలి కాలుష్యం, భూ కలుషితానికి కారణమవుతోందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చెత్త దిబ్బలు తొలగించకపోతే వచ్చే వర్షాకాలంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు ప్రజలు రోగాల భారిన పడతారని హెచ్చరించారు.

- స్థలాలు కోర్టు వివాదాల్లో ఉండటం వల్ల ఇరు వర్గాలు వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదని దీనివల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెట్రేగి పోతున్నాయని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.హెచ్.రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.
- పారిశుద్ధ్య కార్మికులు కూడా ఆయా స్థలాల వైపు చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణ దారి తప్పుతోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.
- 'స్వచ్ఛ హైదరాబాద్, స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాలకు ఈ కాలుష్య కాసార ఖాళీ స్థలాలు కనిపించడం లేదా'..? అని రంగయ్య అధికారులను ప్రశ్నించారు. స్థల యాజమానుల ఉదాసీనత స్థానికులను రోగాల పాలు చేయడం బాధకరమన్నారు.
- ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన మారుతున్న విపత్తులతోనైనా పర్యావరణాన్ని బాగు చేసుకునేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.

### ఇద్దరు కుమార్తెలతో తండ్రి అదృశ్యం



శ్రీనివాస్ (ఫైల్)

**నల్లకుంట:** బార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో తల్లి ఇద్దరు పిల్లలను వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఇద్దరు కుమార్తెలను తీసుకుని అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జీహెచ్‌ఎంసీ ఉద్యోగి శ్రీనివాస్ (36) భార్య భవాని ఇద్దరు కుమార్తెలు సాయి సహస్ర (4), రెండున్నరేళ్ల యస్విత‌తో కలిసి నల్లకుంట నర్సింహా బస్తీలో నివాసం ఉంటున్నారు. కాగా.. ఈనెల 4 న బార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. సహనం కోల్పోయిన శ్రీనివాస్ బార్యపై చేయి చేసుకున్నాడు. దీంతో పిల్లలను వదిలేసి అల్వాల్‌లో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లిపోయింది. 5వ తేదీన తిరిగి ఇంటికి చేరుకోగా.. ఇంట్లో భర్త ఇద్దరు పిల్లలు కనిపించలేదు. భర్త, పిల్లల ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 11న మహిళలు పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు

**బంజారాహిల్స్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గాజుల రామారంలోని ఎలీప్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఈ నెల 11న 'మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎలా ఎదగాలి'అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ లేడి ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(ఎలీప్) అధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి తెలిపారు. హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవి దేవి ముఖ్యఅతిథిగా హాజరై మహిళా పారిశ్రామికవేత్తలనుద్దేశించి మాట్లాడతారన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నం–2లోని ఎలీప్ కార్యాలయంలో రమాదేవీ విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 200 మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొంటారన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలతో పాటు ఎలీప్‌లో పని చేస్తున్న 5 వేల మంది ఉద్యోగుల కోసం ఉచిత మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## 'దేవాలయ రక్షణకు హిందువులు సంఘటితం కావాలి'

**కాచిగూడ:** దేశ వ్యాప్తంగా దేవాలయాల రక్షణకు హిందూవులందరూ సంఘటితంగా ఉద్యమం చేయాలని హిందూ జన జాగృతి సమితి రాష్ట్ర కో–ఆర్డినేటర్ చేతన్‌గాడి పిలుపునిచ్చారు. హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో 'ప్రభుత్వం ఆధీనంలో ఉన్న మందిరాల విషయంలో పక్షపాత ధోరణి ఎందుకు'.. ? అనే అంశంపై మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంగళ్ గ్రహసేవా సంస్థ అధ్యక్షుడు దిగంబర్ మహాలే, ఆనంద్ జఖోటియా తదితరులు మాట్లాడారు. భక్తులు వివిధ ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయానికి వస్తారని ఆలయానికి వచ్చే భక్తుల విశ్వాసాన్ని డబ్బుతో తూకం వేసే ఆలయ నిర్వాహకుల వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర వర్గాల వారు మాత్రం తమ ప్రార్థనా స్థలాల పనులను స్వయంగా నిర్వహించుకుంటున్నారని ఇది హిందువులకు జరుగుతున్న అన్యాయమన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అనేక దేవాలయాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరగడమే కాకుండా హిందువుల మత సంప్రదాయాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. హిందూ భక్తులు, ఆలయ సందర్శకులు, హిందూ సంస్థలు సమిష్టిగా పనిచేసినప్పుడే దేవాలయాల్లో జరిగే ఇలాంటి తప్పుడు వ్యవహారాలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు.

## క్రైస్తవ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నల్లకుంట:** క్రైస్తవుల శ్మశానవాటికకు మూసీ పరీవాహక ప్రాంతంలో స్థలం కేటాయించేందుకు చొరవ తీసుకోవాలని అంబర్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్ రాజ్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. అంబర్‌పేట్ మూసీ పరివాహక ప్రాంతంలోని డంపింగ్ యార్డు పక్కన రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరగా దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వరకుమార్, ఉపాధ్యక్షుడు వల్లభ, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, రాజు తదితరులున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ




గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న దృశ్యం

**ముషీరాబాద్:** ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో విద్యానగర్ మార్క్స్ భవన్‌లో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ సభలో జిల్లా అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ.. 1908 మార్చి 8 న న్యూయార్క్ (అమెరికా)లో మహిళా వస్త్ర పరిశ్రమ కార్మికులు పనిదినాన్ని 10 గంటలకు తగ్గించాలని, మహిళలందరికీ ఓటుహక్కుల స్ఫూర్తి దినంగా మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం ఆవిర్భవించిందన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కావేరి, సంతోష, నవ్య, అరుణ తదితరులున్నారు.

**రేడియో జాకీల ఆధ్వర్యంలో..**

**చిక్కడపల్లి:** ఆల్ ఇండియా రేడియో క్యాజువల్ అనౌన్సర్, రేడియో జాకీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వేడుకలు అలరించాయి. ఆకాశవాణి రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ పీవీ శారద, దూరదర్శన్ కేంద్రం ప్రోగ్రామ్ డైరెక్టర్ హెచ్‌ఓపీ కామేశ్వరి కొల్లారపు, ఆకాశవాణి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ నిహార కానేటి, ప్రముఖ అంకాలజిస్ట్ మల్లిక్ సింగరాజు, మిస్సెస్ ఇండియా–2022 ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సినీనటుడు తనికెళ్ల భరణి రచించిన గోగ్రహణం నాటకాన్ని ప్రదర్శించారు. రేడియో జాకీలు, ప్రముఖ సినీ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ, డా.సురభి రమేష్‌లను ఘనంగా సత్కరించారు. లక్ష్మి పెండ్యాల, ఆర్జే స్వాతి, సింగరాజు స్పాన్సర్లుగా వ్యవహరించారు.

**గవర్నర్ చేతుల మీదుగా మహిళా పురస్కారం**

**కాచిగూడ:** రాజ్‌భవన్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మున్నూరుకాపు సంఘం మహిళా విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు డా. కృష్ణవేణి శ్రీనివాస్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు మున్నూరు కాపు సంఘం నేతలు, మహిళా సంఘం ప్రతినిధులు అభినందించారు.

## తెలుగు భాషను పరిరక్షించుకోవాలి



శిరోమణి అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న విజయబాబు తదితరులు

**చిక్కడపల్లి:** తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం చైర్మన్ విజయబాబు అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ప్రముఖ లలిత గేయరచయిత, బాలబంధు డాక్టర్ ఎం.కె.రాము జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన మాతృభాష సేవా శిరోమణి అవార్డు ప్రధానోత్సవం శిఖరం ఆర్ట్స్ థియేటర్స్, వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్, కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఏపీ ప్రభుత్వం తరపున రాముకు మాతృభాష సేవా శిరోమణి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. తెలుగుభాషకు చావు లేదని కొన్ని శక్తులు తెలుగు భాషపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

- పైరవికారులకే నేడు కొందరు అవార్డులు ఇస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంచి రచయితలు, కళాకారులకే అవార్డులు ఇస్తుందన్నారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన రామును సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సాహిత్య రంగంలో రాము విశేష కృషి చేశారని కొనియాడారు.
- దాదాపు 1000 లలిత గీతాలను స్వరపరిచారని గత 54 ఏళ్లుగా రసమయి సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహించిన కళలు, కళాకారులను ప్రోత్సహించారన్నారు. సాహితీసుధానిధి, రుబాయి కవి సామ్రాట్ డా. తిరుమల శ్రీనివాసాచార్య, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య గౌరీశంకర్, దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు, ఆదాయ పన్ను మాజీ చీఫ్ కమిషనర్ నరసింహప్ప, ప్రముఖ సాహితీవేత్త డా. తిరుమలశ్రీనివాసాచార్య, బైసా దేవదాసు, వంశీ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు డా.వంశీ రామరాజు, కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ అంజిబాబు, ప్రొఫెసర్, డా. శరత్‌జ్యోత్స్న్య, రాణి, ప్రముఖ సినీ దర్శకుడు సురేష్‌కుమార్, లిటిల్ మ్యుజీషియన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచారి, శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ వ్యవస్థాపక కార్యదర్శి గొల్లకృష్ణ, కళానిలయం అధ్యక్షుడు సురేందర్ పాల్గొన్నారు.

## కేవైసీ పేరుతో కుచ్చు టోపీ.. కేసు నమోదు

**నల్లకుంట:** బ్యాంక్ ఖాతాకు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ వ్యక్తి ఖాతా నుంచి సైబర్ కేటుగాళ్లు నగదును చోరీ చేసిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ గుండు సమీపంలో నివాసం ఉండే ముఠా మధుసూదన్‌కు హెచ్‌డీఎఫ్‌సీలో ఖాతా ఉంది. కాగా.. మీ బ్యాంక్ ఖాతాకు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఈనెల 6 న ఉదయం ఓ గుర్తు తెలియని నంబరు నుంచి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. లింక్‌ను ఓపెన్ చేసి వివరాలను పొందుపరచగా.. క్షణాల్లోనే అతడి ఖాతా నుంచి రూ. 49,560 విత్ డ్రా చేసుకున్నట్టు బ్యాంక్ నుంచి మెస్సేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సోమవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సైబర్ క్రైమ్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.